క్లుప్తంగా

ప్లేట్లు, కుర్చీలు అందజేత


ప్లేట్లు అందజేస్తున్న లచ్చయ్య

గంగాధర: మండలంలోని మల్లాపూర్‌కు చెందిన తూడి లచ్చయ్య గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేయడానికి శుక్రవారం ప్లేట్లు అందజేశారు. గ్రామపంచాయతీ పరిధిలోని నడింపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు కుర్చీలు అందజేశారు. ఈసందర్భంగా దాత లచ్చయ్య మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలలో సమస్యల పరిష్కారానికి తనవంతు సహకారం అందిస్తానన్నారు.

ముగిసిన ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం


ముగింపు సమావేశంలో సర్పంచ్, తదితరులు

గంగాధర: మండలంలోని గర్శకుర్తి, కాసారం గ్రామాల్లో కరీంనగర్‌కు చెందిన వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు ఏడు రోజులుగా నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరం శుక్రవారం ముగిసింది. ఈసందర్భంగా సర్పంచు అలువాల నాగలక్ష్మి మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సూచించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ జలపతి, హెచ్‌ఎం ప్రవీణ్‌కుమార్, ఎస్‌ఎంసీ చైర్మన్ శ్రీనివాస్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారులు గోపికృష్ణ, సతీష్‌కుమార్, రాజు పాల్గొన్నారు.

'నిందితులను కాపాడటానికి బీఆర్‌ఎస్ ప్రయత్నిస్తోంది'


మాట్లాడుతున్న సత్యరాజ్‌వర్మ

గంగాధర: టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రాల లీకేజీలో నిందితులను కాపాడటానికి బీఆర్‌ఎస్ ప్రయత్నిస్తోందని, నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిలారెడ్డిని పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించడాన్ని పార్టీ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి తడగొండ సత్యరాజ్‌వర్మ ఖండించారు. శుక్రవారం గంగాధరలో మాట్లాడు తూ.. రాష్ట్రంలో అవినీతి, అక్రమాలను ప్రశ్నిస్తే కేసులు పెట్టడం, అరెస్టులు చేస్తున్నారని, ప్రభుత్వ వైఖరికి నిరసనగా ప్రజలు తిరుగుబాటు చేసే రోజులు దగ్గర్లో ఉన్నాయని పేర్కొన్నారు. ఏప్రిల్ 2న గంగాధరలో పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశం ఉంటుందన్నారు.

పరిహారం చెల్లించాలి

జమ్మికుంట: అకాల వర్షాలకు నష్టపోయిన మొక్కజొన్న రైతులతో పాటు వరి రైతులను ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు వీరంనేని పర్శరాంరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని గండ్రపల్లి గ్రామంలో శుక్రవారం మాట్లాడారు. మొక్కజొన్నపై మాత్రమే అధికారులు సర్వే చేస్తున్నారని, వరిపై సర్వే చేయకపోవడం ఏంటని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ రైతుల పట్ల వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. రెండు పంటలకు పరిహారం చెల్లించాలన్నారు. ఎకరాకు రూ.10వేలు పరిహారం చెల్లిస్తామని సీఎం ప్రకటించారు కానీ ఎకరాకు ఇప్పటి వరకు రూ.40వేల పెట్టుబడి అయిందని, పరిహారం చెల్లించకుంటే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కనీసం ఎకరాకు రూ.50వేల చొప్పున పరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని కోరారు.

సౌకర్యాలు కల్పించాలి

హుజూరాబాద్‌రూరల్: ఏప్రిల్ 3 నుంచి జరగబోయే పది పరీక్షా కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామారపు వెంకటేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. కేంద్రాల్లో నిరంతర విద్యుత్ సరఫరా, సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు సమయానికి పరీక్షలకు హాజరయ్యేలా అధికారులు ఏర్పాట్లు చేయాలన్నారు.

సమస్యలు పరిష్కరించేదెన్నడో..?

- పదమూడో వార్డులో మౌలిక వసతులు కరువు
- మున్సిపల్ ఎన్నికలప్పుడు వార్డును దత్తత తీసుకుంటామని ప్రచారం
- అభివృద్ధిని మరిచిన వైనం

చొప్పదండి: మున్సిపల్ ఎన్నికల సమయంలో పట్టణంలోని పదమూడో వార్డును దత్తత తీసుకుంటామని నాయకులు మభ్యపెట్టారు. తీరా గెలిచాక వార్డులోని సమస్యలను పరిష్కరించడంలో విఫలమవుతున్నారు. మురుగుకాలువలు, సీసీరోడ్లు, చెత్త, వాటర్ ట్యాంకు మరమ్మతు, నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు, రామాలయం అభివృద్ధి వంటివి పరిష్కరించకపోవడంతో స్థానికులు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. ఎన్నికల సమయంలో వార్డును దత్తత తీసుకుంటామని, కొత్త విద్యుత్ పోల్స్ వేస్తామని ప్రచారం చేశారని, అధికారంలోకి వచ్చాక హామీలు విస్మరిస్తున్నారని ప్రతిపక్ష నాయకులు ఆరోపిస్తున్నారు.

పరిష్కారం ఏదీ..

- వార్డు పరిధిలో ఇప్పుడు పాఠశాల స్థలం హాట్‌టా పిక్‌గా మారింది. నాలుగు దశాబ్దాలుగా ఉన్న పాఠశాల స్థలం ఇప్పుడు ఆక్రమణకు గురైంది.
- భవిష్యత్ తరాలకు ఉపయోగపడే పాఠశాల స్థలాన్ని కాపాడటంలో అధికారులు, ప్రజాప్రతినిధులు విఫలమవుతున్నారని విమర్శలు వెలువడుతున్నాయి.
- వార్డు పరిధిలోని పురాతన వాటర్ ట్యాంకు పగుళ్లు బారి పెచ్చులు ఊడి పడుతున్నా పట్టించుకోవడం లేదు. రామాలయం శిథిలావస్థకు చేరినా, ఆలయ స్థలాన్ని ఆక్రమిస్తున్నా పట్టించుకోవడం లేదు.
- వార్డులో గతంలో నిర్మించిన మురుగుకాలువలు శిథిలావస్థకు చేరాయి. దీంతో ఎక్కడికక్కడ మురుగునీరు నిలస్తుండటంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. పందులు స్వైర విహారం చేస్తున్నాయి.


వార్డులో పందుల స్వైర విహారం


ప్రమాదకరంగా వాటర్ ట్యాంకు


డ్రైయినేజీని చూపిస్తున్న ప్రజలు

మరమ్మతులు చేయాలి



వార్డులోని చిన్నరోడ్లకు మరమ్మతులు చేయాలి. దశాబ్దాల క్రితం నిర్మించిన మురుగుకాలువలు శిథిలావస్థకు చేరాయి. నూతన సీసీరోడ్లతో పాటు మురుగు కాలువలు ఏర్పాటు చేయాలి. పందులను నిర్మూలించాలి.

– తిప్పర్తి బ్రజేశ్వర్, చొప్పదండి

హామీలు నెరవేర్చాలి



వార్డులో ఏళ్ల క్రితం నిర్మించిన వాటర్ ట్యాంకు శిథిలావస్థకు చేరింది. పెచ్చులు ఊడిపడుతున్నాయి. ప్రమాదకరంగా మారిన ట్యాంక్‌కు మరమ్మతులు చేయాలి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలి.

– పెద్ది బక్కయ్య, చొప్పదండి

ఉత్తమ ఆశయాలతో ముందుకు సాగాలి


మాట్లాడుతున్న ఎంపీపీ కలిగేటి కవిత


మాట్లాడుతున్న ఎంఈవో కేతిరి నర్సింహారెడ్డి

రామడుగు: విద్యార్థులు ఉత్తమ ఆశయాలతో ముందుకు సాగుతూ ఉన్నత శిఖరాలు చేరుకోవాలని ఎంపీపీ కలిగేటి కవిత అన్నారు. మండలంలోని గోపాల్‌రావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో మాట్లాడారు. ప్రణాళికతో చదువుతూ మంచి మార్కులు సాధించేందుకు ప్రయత్నం చేయాలని సూచించారు. ఎస్సై అంజయ్య మాట్లాడుతూ... కష్టపడి చదివితే ఉన్నత స్థాయి ఉద్యోగాలను సాధించే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో వేణుకుమార్, ఇన్‌చార్జి హెచ్‌ఎం ప్రకాష్, ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం జానకి, నాయకులు కొలిపాక మల్లేశం, బుర్ర సాయిలు, లక్ష్మణ్, పాపిరెడ్డి పలువురు పాల్గొన్నారు.

హుజూరాబాద్‌రూరల్: విద్యార్థులు స్పష్టమైన లక్ష్యం ఏర్పరుచుకోవాలని ఎంఈవో కేతిరి నర్సింహారెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులకు నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు పది తరగతి తర్వాత ఏం చేయాలన్న దానిపై స్పష్టమైన అవగాహనతో ముందుకు సాగాలన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో హెచ్‌ఎం, టీచర్లు పాల్గొన్నారు.

సహకార సంఘాల అభివృద్ధికి కృషి చేయాలి

- పాలకవర్గంపై సభ్యుల మండిపాటు
- పలు ప్రశ్నలకు సమాధానాలు చెప్పాలని డిమాండ్


మాట్లాడుతున్న అధ్యక్షుడు రాధాకిషన్

మానకొండూర్: సహకార సంఘాల అభివృద్ధికి సభ్యుల కృషి అవసరమని మండలంలోని గట్టుదుద్దెనపల్లి విశాల సహకార సంఘం అధ్యక్షుడు అనబేరి రాధాకిషన్ అన్నారు. శుక్రవారం సంఘం సాధారణ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రగతి నివేదికలను ఇన్‌చార్జి సీఈవో సంజీవ్ చదివి వినిపించారు. అనంతరం సభ్యులు సమస్యలను లేవనెత్తారు. రిజక్షన్ వడ్లు డీసీ (డెలివరీ చలాన్) లేకుండా ఎలా అమ్మారని సభ్యులు పాలకవర్గాన్ని తప్పు బట్టి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సంఘం ద్వారా గ్రామంలో చేపట్టిన ఫంక్షన్ హాల్ పర్మిషన్ తీసుకోకుండా నడిపిస్తున్నారని, తాను స్వయంగా చెప్పిన పట్టించుకోకపోవడమేంటని సర్పంచ్ దేవ సతీష్‌రెడ్డి ప్రశ్నించారు. గ్రామ పంచాయతీ ట్రాక్టర్లకు డీజిల్ పోసి వెంటనే సంఘం వసూలు చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. నేషనల్ హైవే కింద సంఘం ఆస్తులు కోల్పోతుండగా నష్టపరిహార డబ్బులు తీసుకునేందుకు ఆమోదం తెలపాలని సభ్యులను అధ్యక్షుడు కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ వైస్ చైర్మెన్ పెంచాల రాజయ్య, డైరెక్టర్లు, సభ్యులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారం తిప్పికొట్టాలి


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

చొప్పదండి: పన్నెండు వందల కోట్లతో చొప్పదండి నియోజకవర్గం అభివృద్ధి చేశామని, సీఎం కేసీఆర్ కార్యదీక్షుడని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. పట్టణంలోని జీఆర్‌ఆర్ గార్డెన్స్‌లో శుక్రవారం బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం పార్టీ మండలశాఖ అధ్యక్షుడు వెల్మ శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామక్రిష్ణారావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్ హాజరై మాట్లాడారు. బీజేపీ అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ చిలుక రవీందర్, జెడ్పీటీసీ మాచర్ల సౌజన్య, ఏఎంసీ చైర్మన్ గడ్డం చుక్కారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్‌లు వెల్మ మల్లారెడ్డి, మినుపాల తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి


డ్రైనేజీని పరిశీలిస్తున్న చైర్మన్ రాజేశ్వర్‌రావు

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని ఆరోవార్డులో మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, కౌన్సిలర్లు శుక్రవారం పర్యటించారు. వార్డులో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి ఎంతమేరకు మురుగుకాలువ నిర్మించాలి, వరదనీరు వెళ్లే మార్గంపై చర్చించారు. ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ పొనగంటి సంపత్, కౌన్సిలర్లు శ్రీపతి నరేష్, పాతకాల రమేష్, దయ్యాల శ్రీనివాస్, పొనగంటి మల్లయ్య తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాల బారిన పడొద్దు


మాట్లాడుతున్న ఎస్సై రాజన్న

హుజూరాబాద్‌రూరల్: విద్యార్థులు సైబర్ నేరాల బారిన పడొద్దని ఎస్‌ఐ రాజన్న అన్నారు. రాష్ట్ర మహిళా పోలీస్ విభాగం, పోలీసుశాఖ, పాఠశాల విద్యాశాఖ సహకారంతో శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మండలంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ... సైబర్ మోసాలు, నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, ఆన్‌లైన్ ఆర్థిక లావాదేవీల నిర్వహణలో జాగ్రత్తగా ఉండాలన్నారు. సైబర్ మోసాలకు 1930, ఇతర అత్యవసర సేవలకు డయల్ 100 ఫోన్ చేయాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అంజయ్య, పూరుకొండ సత్యప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరం ప్రారంభం


శిబిరాన్ని ప్రారంభిస్తున్న బండ శ్రీనివాస్

హుజూరాబాద్‌రూరల్: నిరుపేదలకు కంటి వెలుగు శిబిరాలు వరమని, కంటి సమస్యల పరిష్కారానికి సీఎం కేసీఆర్ పథకం తీసుకొచ్చారని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని 7, 22 వార్డుల్లో కంటి వెలుగు శిబిరాలను ప్రారంభించారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా కార్యక్రమం చేపట్టిందని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధిక ,వైస్ చైర్‌పర్సన్ కొలిపాక నిర్మల, స్థానిక కౌన్సిలర్ పైళ్ల వెంకటరెడ్డి, మున్సిపల్ కమిషనర్ కమిషనర్ సమ్మయ్య, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ వడ్లూరు విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దళితబంధు యూనిట్ ప్రారంభం

హుజూరాబాద్‌రూరల్: పట్టణానికి చెందిన కోయల్‌కార్ నాగ సుమన్, వల్లాల అఖిల్ దళిత బంధు పథకం కింద ఏర్పాటు చేసుకున్న యూనిట్‌ను శుక్రవారం ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ వడ్లూరి విజయ్‌కుమార్, సేవ్ ది ట్రీ చైర్మన్ వర్ధినేని రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

హుజూరాబాద్‌రూరల్: పట్టణానికి చెందిన నగునూరి మౌనిక ఎంబీబీఎస్ చదువుతోంది. శుక్రవారం విద్యార్థిని చదువుకోసం ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ సమక్షంలో సేవ్ ది ట్రీస్ అధినేత వర్ధినేని రవీందర్‌రావు రూ.10 వేల ఆర్థికసాయం ఆమె తండ్రి సంపత్‌కు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఎడవెల్లి కొండాల్ రెడ్డి, కొలిపాక శ్రీనివాస్,తాళ్లపల్లి శ్రీనివాస్, మొటం రామ్‌కుమార్, వేల్పుల రత్నం, సదుల రవీందర్‌బాబు, కౌన్సిలర్లు, వాకర్లు తదితరులున్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల నృత్యాలు


డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

శంకరపట్నం: మండలంలోని రాజాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సత్యనారాయణ, సర్పంచ్ వసంత, ఎంపీటీసీ లక్ష్మి, ఉపాధ్యాయులు , విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల పరామర్శ

మానకొండూర్: మండలంలోని ముంజంపల్లి గ్రామానికి చెందిన నందగిరి రాంబాయి ఇటీవల మృతి చెందగా ఆమె కుటుంబ సభ్యులను మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ పరామర్శించారు. కుమారుడు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీంద్రాచారిని ఓదార్చారు. వెంట టీపీసీసీ కార్యదర్శి అంజన్‌కుమార్, సుజిత్‌కుమార్, తాళ్లపల్లి సంపత్, చలిగంటి సంపత్, గట్టు శ్రీధర్,గసిగంటి సంపత్, శ్రీనివాస్ కనకయ్య పాల్గొన్నారు.

గంగాధర: మండలంలోని వెంకంపల్లి గ్రామానికి చెందిన సంకటి మల్లవ్వ, సంకటి రామయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం పరామర్శించారు. వెంట స్థానిక కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

గూడ్స్ డ్రైవర్ల వేతనాలు పెంచాలి

చొప్పదండి: గూడ్స్ డ్రైవర్ల వేతనాలను పెంచాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని ఆర్నకొండలో మేకలు, గొర్రెల వ్యాపారుల వద్ద పనిచేసే డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. పది రోజులుగా చేస్తున్న నిరసనకు యజమానులు తలొగ్గడం లేదని అన్నారు. రూ.26 వేలు చెల్లించాలని సూచించారు. డ్రైవర్ల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. వెంట పున్నం రవి, పులిపాక ప్రసాద్, కూన కుమార్, దామెర నాగరాజు, కాడె కార్తీక్, మహేశ్, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై ట్రాక్టర్లు అందించాలి

సైదాపూర్: రైతులకు ఏటా ఇవ్వాల్సిన సబ్సిడీ పనిముట్లు, యంత్రపరికరాల పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం ఎగనామం పెట్టిందని, ఐదెకరాల భూమి ఉన్న రైతులకు సబ్సిడీపై ట్రాక్టర్లు అందించాలని డీసీసీ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు చాడ కొండాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. రైతుబంధు ఇస్తున్నామని, యంత్ర, పనిముట్లు ఇవ్వకపోవడంతో రైతులపై పనిముట్ల భారం పడుతోందన్నారు. ఉపాధిహామీ పథకంలో వ్యవసాయబావుల తవ్వకం చేపట్టాలని డిమాండ్ చేశారు.

బస్సు సౌకర్యం వినియోగించుకోవాలి

వీణవంక: పదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వం ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం హర్షనీయమని టీహెచ్‌ఆర్‌టీఎం వ్యవస్థాపక అధ్యక్షుడు అప్పని హరీశ్‌వర్మ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం మాట్లాడారు. ఏప్రిల్ 3వ తేదీ నుంచి పరీక్షలు జరగనున్న నేపథ్యంలో విద్యార్థుల ఇబ్బందులను గుర్తించి బస్సు సౌకర్యం కల్పించడంతో సరైన సమయానికి సెంటర్‌కు చేరుకుంటారని తెలిపారు.

ఎగ్లాస్‌పూర్‌లో సివిల్ రైట్స్‌డే

సైదాపూర్: మండలంలోని ఎగ్లాస్‌పూర్ ఎస్సీ కాలనీలో శుక్రవారం సివిల్ రైట్స్ డే నిర్వహించారు. కులవివక్ష చూపొద్దని, ఎవరిని తక్కువగా చూడొద్దని, అన్ని కులాలు సమానమేనని డిప్యూటీ తహసీల్దార్ మల్లేశం సూచించారు. ఎస్సీ కాలనీల అభివృద్ధికి పంచాయతీలు కృషి చేయాలన్నారు. సర్పంచ్ రాజిరెడ్డి, ఆర్‌ఐ శరత్, కార్యదర్శి అభిలాష్, కారోబార్ శ్రీనివాస్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

రేపు బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా కార్యవర్గ సమావేశం


మాట్లాడుతున్న జాడి బాల్‌రెడ్డి

శంకరపట్నం: రేకుర్తిలో ఏప్రిల్ 2న నిర్వహించే బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా కార్యవర్గ సమావేశాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి కోరారు. కేశవపట్నంలో శుక్రవారం మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ ఎస్సీ సామాజిక వర్గానికి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని, బీఆర్‌ఎస్ ప్రభుత్వం దళిత వ్యతిరేక విధానాలను అవలింబిస్తోందని విమర్శించారు. రాష్ట్ర, జిల్లా నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు. వెంట ప్రసాద్, రాజు,జైపాల్, నరేందర్, సారయ్య, శివారెడ్డి రంజిత్,రాములు, పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మానకొండూర్: మండలంలోని కొండపల్కల గ్రామానికి చెందిన గట్టు అనిల్‌గౌడ్ (32) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు... ఆర్థిక ఇబ్బందులతో అనిల్‌గౌడ్ సోమవారం పురుగుల మందు తాగాడు. వెంటనే కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడని, మృతుడికి భార్య, ఎనిమిది నెలల పాప ఉంది.

ఆడపిల్లలను కాపాడుకోవాలి

- మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్‌రూరల్: ఆడపిల్లలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. శుక్రవారం కరీంనగర్ మండలంలోని మొగ్దుంపూర్‌లో సర్పంచ్ జక్కం నర్సయ్య ఆడపిల్ల పుడితే కానుకగా అందిస్తున్న రూ.5 వేల పోస్టాఫీసు డిపాజిట్ పత్రాలను ఆరుగురు లబ్ధిదారులకు మంత్రి కమలాకర్ అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆడపిల్లల సంక్షేమానికి ప్రభుత్వం కేసీఆర్ కిట్, కల్యాణలక్ష్మితోపాటు కొత్తగా న్యూట్రిషన్ కిట్‌ను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ టి.లక్ష్మయ్య, ఉపసర్పంచు కె.తిరుపతి, ఎంపీటీసీ సభ్యురాలు డి.పుష్ప, కరీంనగర్ సింగిల్‌విండో చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి, వార్డుసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

80 వేల మందికి కంటి పరీక్షలు

కరీంనగర్ సిటీ: ప్రతీ మనిషికి కళ్లు ప్రధానమని మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. కమిషనర్ సేవా ఇస్లావత్‌తో కలిసి 3, 9వ డివిజన్లలో శుక్రవారం పర్యటించారు. 3వ డివిజన్ కిసాన్‌నగర్‌లో కార్పొరేటర్ కంసాల శ్రీనివాస్, 9వ డివిజన్ కోతిరాంపూర్‌లో కార్పొరేటర్ ఐలేందర్ యాదవ్‌లతో కలిసి కంటి వెలుగు శిబిరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్య రక్షణే ధ్యేయంగా సీఎం కేసీఆర్ రెండో విడత కంటి వెలుగును ప్రతిష్ఠాత్మకంగా చేపట్టారని తెలిపారు. ప్రజల ఆరోగ్యం, సంక్షేమం, అభివృద్ధిలో మన రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని వినియోగించుకొని, ఉచితంగా పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. నగర వ్యాప్తంగా ఇప్పటివరకు 80 వేల మందికి కంటి పరీక్షలు చేసి, అవసరమైనవారికి కళ్లద్దాలు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. దాదాపు 40 వేల మందికి రీడింగ్ గ్లాసెస్ అందించినట్లు తెలిపారు. కంటి ఆపరేషన్ అవసరమైన వారికి శిబిరాల అనంతరం ఉచితంగా చేయిస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ త్రయంభకేశ్వర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

వైభవంగా శ్రీరామపట్టాభిషేకం

జమ్మికుంట: మున్సిపల్ పరిధి రైల్వే స్టేషన్ ప్రాంగణంలోని రామాలయంలో శ్రీ సీతారాముల బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీరామపట్టాభిషేకం వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని తిలకించారు. అనంతరం భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పట్టణ పుర ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.


పట్టాభిషేకం నిర్వహిస్తున్న వేదపండితులు

పౌష్టికాహారం, చిరుధాన్యాలపై అవగాహన

గన్నేరువరం: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పౌష్టిహారం, చిరుధాన్యాలపై పిల్లల తల్లులు, గర్భిణులకు అవగాహన కల్పించారు. చిన్నారులకు అన్నప్రాసన చేశారు. అనంతరం యోగా డే నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ పుష్పలత, గ్రామస్తులు పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలోని రాజాపూర్ గ్రామంలో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్ గ్రామస్తులతో పోషణ్ పక్వాడా ప్రతిజ్ఞ చేయించారు. చిన్నారులకు బలవర్ధకమైన ఆహారం అందిస్తామని, గర్భిణులు, బాలింతలు పోషకాహారం ఇస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వసంత, ఎంపీటీసీ లక్ష్మి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.


గన్నేరువరం: యోగా చేస్తున్న లక్ష్మి, చిన్నారుల తల్లులు